సాక్షి అనంతపురం

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



అరాచక రాజు పోలీసుగా అనర్హుడు

కూడేరు పోలీసుస్టేషన్ సీఐ రాజు అరాచకాలపై బాధితులు కదం తొక్కారు. తక్షణమే సీఐను సస్పెండ్ చేయాలంటూ సోమవారం ర్యాలీ చేపట్టారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

34.5°/21.2°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆత్మగౌరవంతో ఆటలు

- సచివాలయ ఉద్యోగులపై చంద్రబాబు సర్కారు నిర్దయ
- మద్యం షాపులు, బార్‌ల ఫొటోలు తీయాలని ఆదేశం



అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తోంది. వారి చేత ఏ పనిచేయించాలనే విచక్షణ మరచి బాధ్యతలను అప్పగిస్తోంది. ఒకవైపు ఆత్మగౌరవం కోసం వారు ఉద్యమిస్తుంటే... వారి ఆత్మగౌరవాన్ని అణచివేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చివరికి వారితో మద్యం దుకాణాలు, బార్‌ల ఫొటోలు తీయడంతో పాటు జియో ట్యాగ్ చేయించేందుకు సిద్ధపడింది. ఈ మేరకు గ్రామ,వార్డు సచివాలయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన సర్వే మంగళవారం చేపట్టి అదే రోజు పూర్తి చేయాలని ఆదేశించారు. దుకాణానికి లేదా బార్‌కు రోజూ ఎంత మంది వస్తున్నారు, వ్యాపారం ఎంత జరుగుతోంది తదితర వివరాలను కూడా సేకరించాలని సూచించారు. సర్వేను పర్యవేక్షించాలని ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, పరిపాలన కార్యదర్శులు ఈ సర్వే చేయాల్సి ఉంటుంది. అయితే మహిళా కార్యదర్శులకు సర్వే నుంచి మినహాయింపు ఇచ్చారు.

సదరం క్యాంపులు వాయిదా

అనంతపురం అర్బన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో పరిపాలన, భద్రత ఏర్పాట్ల దృష్ట్యా జిల్లాలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగాల్సిన సదరం క్యాంపులను వాయిదా వేసినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పద్మావతి ఆదేశాలు జారీ చేసినట్లు తెలియజేశారు. పింఛనుదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సవరించిన షెడ్యూల్‌ను దివ్యాంగులకు ఎస్ఎంఎస్, ఇతర మార్గాల ద్వారా తెలియజేస్తామన్నారు. అధికారులు సెర్ప్, జీఎస్‌డబ్ల్యూఎస్ సాంకేతిక బృందంతో సమన్వయం చేసుకుని సదరం క్యాంపుల తదుపరి తేదీలతో షెడ్యూల్ విడుదల చేయాలని సూచించారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్



వంట సరుకులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రాజశేఖర్ అన్నారు. సోమవారం నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న ఎస్సీ, బీసీ బాలికల కళాశాల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. మెనూ సక్రమంగా అమలు చేసి రుచికరమైన భోజనం అందించాలన్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ఏపీ క్రికెట్ జట్టులో చోటు



కామిల్

అనంతపురం కార్పొరేషన్: బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీలో ప్రాతినిథ్యం వహించే అండర్–23 ఆంధ్ర జట్టులో జిల్లాకు చెందిన కామిల్‌కు చోటు దక్కింది. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు అనంతపురం స్పోర్ట్స్ సెంటర్‌లో ఆంధ్ర, ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. గుంతకల్లుకు చెందిన కామిల్ ఆల్‌రౌండ్ ప్రతిభతో రాణిస్తున్నాడు. ఈ సందర్భంగా కామిల్‌ను ఏడీసీఏ కార్యదర్శి భీమలింగారెడ్డి, వెటరన్ క్రికెటర్ గులాం ఖాదీర్, కోచ్ షోయబ్ అభినందించారు.

నకిలీపై నిరసనాగ్రహం

- కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సర్కారు తీరుపై గళమెత్తిన మహిళలు
- 'అనంత'లో ఎక్సైజ్ కార్యాలయం వద్ద మూడు గంటల పాటు బైఠాయింపు

అనంతపురం: నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చేసి, రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలను కూటమి ప్రభుత్వం హరిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు నిర్వహించారు. బెల్టుషాపులు, నకిలీ మద్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పోరుబాటకు మహిళలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపి సర్కారు తీరుపై గళమెత్తడం గమనార్హం.

మూడు గంటలు ఆందోళన..

కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా అనంతపురంలో చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. నగరంలోని ప్రకాష్‌రోడ్డులో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

దిగొచ్చిన డిప్యూటీ కమిషనర్ ..

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వచ్చి వినతి పత్రం తీసుకునేంత వరకు కదిలేది లేదంటూ నాయకులు భీష్మించుకూర్చున్నారు. డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్ రెడ్డి వినతిపత్రం తీసుకోవడానికి ముందుకు రాగా.. గో బ్యాక్ సూపరింటెండెంట్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన కూడా వెనక్కి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లిలో ఉన్న డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్యకు స్థానిక ఎక్సైజ్ అధికారులు సమాచారం ఇవ్వగా.. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనకు పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించి నకిలీ మద్యాన్ని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం, దాసరి వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నకిలీ మద్యం, బెల్ట్‌షాపులను నిర్మూలించాలంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో గుత్తిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. నకిలీ మద్యానికి ఆద్యులైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి డిమాండ్ చేశారు.
- రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో కణేకల్లు రోడ్డు నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్‌కు వినతి పత్రం ఇచ్చారు. పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు ఎల్ఎం మోహన్ రెడ్డి, ఎస్ఈసీ సభ్యులు గౌని ఉపేంద్ర రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప తదితరులు పాల్గొన్నారు.
- శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎక్సైజ్ సీఐ సునీతారాణికి వినతి పత్రం అందజేశారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు నీలం భాస్కర తదితరులు పాల్గొన్నారు.
- కళ్యాణదుర్గంలో నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎక్సైజ్ సీఐ సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, శెట్టూరు మండల కన్వీనర్ ఎంఎస్ హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రాణాలు తీస్తున్న నారా వారి నకిలీ మద్యంపై రణభేరి



గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కళ్యాణదుర్గంలో ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న తలారి రంగయ్య



బీకేఎస్‌లో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ ఆధ్వర్యంలో ర్యాలీ



రాయదుర్గంలో వైఎస్సార్ సీపీ నేత మెట్టు విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన

మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి



చేతులెత్తి ఐక్యత చాటుతున్న ఐద్వా నాయకురాళ్లు

- ఐద్వా నేతల పిలుపు
- అనంతపురంలో రాష్ట్ర మహాసభలు ప్రారంభం

అనంతపురం అర్బన్: మహిళల హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్ర, రాష్ట్ర నాయకులు అన్నారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు అనంతపురంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజు స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి లలితకళాపరిషత్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సామాజికవేత్త తీస్తా సెతల్వాద్, జాతీయ అధ్యక్షురాలు టీచర్, ప్రధాన కార్యదర్శి ధావలే, కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడారు. మహిళలపై హింస మరింత పెరిగిందన్నారు. సనాతనం పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళల హక్కులను హరిస్తున్నాయన్నారు. మహిళల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఐద్వా సాగిస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆహార భద్రత, ఉపాధి భద్రత కోసం కేంద్రాన్ని నిధులు అడగలేని స్థితిలో ఏపీ, బిహార్ ముఖ్యమంత్రులు ఉండడం దురదృష్టకరమన్నారు. ఉపాధి హామీ బిల్లులు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వాలు ప్రజల మధ్య చిచ్చుపెట్టి అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షురాళ్లు పద్మావతి, వీకే పద్మ, తదితరులు పాల్గొన్నారు.



మహాసభలకు హాజరైన మహిళలు

ఓలా ఈ –బైక్ కంపెనీకి జరిమానా



అనంతపురం: ఓలా ఈ–బైక్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషనర్ జరిమానా విధించింది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం బత్తువానిపల్లి గ్రామానికి చెందిన పోలవరపు నాగరాజు 2024 ఏప్రిల్ 19న తన రూపే క్రెడిట్ కార్డు ద్వారా రూ.80,449 మొత్తాన్ని 'ఓలా ఈ–బైక్' కొనుగోలు నిమిత్తం చెల్లించాడు. కళ్యాణదుర్గం స్టేట్ బ్యాంకు జారీ చేసిన క్రెడిట్ కార్డు ద్వారా ఈ మొత్తాన్ని వారికి జమ చేశాడు. అయితే, ఓలా కంపెనీ వారు బైక్‌ను ఇవ్వకపోగా ఫోన్ కాల్స్, ఈ–మెయిల్స్‌కు కూడా స్పందించలేదు. ఈ నేపథ్యంలో 2024 అక్టోబర్ 18న ఓలా ఈ–బైక్ కంపెనీకి నాగరాజు లీగల్ నోటీసులు పంపాడు. వినియోగదారుల కమిషన్‌లో కేసు నమోదు చేశాడు. ఈ క్రమంలో ఓలా కంపెనీ ప్రతినిధులు కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. తమకు ఎలాంటి మొత్తం చెల్లించలేదని, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని కంపెనీ తరఫున న్యాయవాదులు పేర్కొన్నారు. అయితే, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వారి వివరాల మేరకు ఓలా కంపెనీకి నాగరాజు నగదు చెల్లించినట్లు నిర్ధారణ కావడంతో వినియోగదారుల కమిషన్ ఫిర్యాదుదారు వాదనలతో ఏకీభవించింది. డబ్బు వెనక్కి చెల్లించకపోవడం, బైక్ ఇవ్వకపోవడాన్ని సేవాలోపంగా పరిగణించింది. ఫిర్యాదుదారు చెల్లించిన రూ. 80,449 మొత్తానికి 9 శాతం వార్షిక వడ్డీతో 2024 ఏప్రిల్ 19వ తేదీ నుంచి చెల్లించాలని తీర్పు వెలువరించింది. అలాగే, మానసిక వేదనకు పరిహారంగా రూ.20 వేలు, కోర్టు ఖర్చులు రూ.5 వేల చొప్పున మొత్తం సొమ్మును 45 రోజుల్లోపు చెల్లించాలని ఆదేశించింది. వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యులు గ్రేస్‌మేరీ, బి. గోపీనాథ్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకు సేవా లోపం లేదని నిర్ధారణ కావడంతో ఎస్‌బీఐపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ప్రశ్నిస్తే దాడులు.. మహిళలపై వేధింపులు

- మన్నీలలో అరాచకాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- ప్రాణాలు పోకముందే స్పందించాలని వేడుకోలు



డీఎస్పీ మహబూబ్ బాషాకు విన్నవిస్తున్న మన్నీల గ్రామస్తులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో అరాచకాలు సృష్టిస్తున్న కుటుంబాలతో గ్రామస్తులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోయారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలో పోలీసు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి విన్నవించారు. సుమారు వందమంది గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. బోయ బాలు, బోయ జయరాం, బోయ ఈశ్వర, బోయ శివ, బోయ బాలచంద్ర, ముష్టూరు బోయ అంజితో పాటు వారి బంధువులతో గ్రామంలో ఏ క్షణమైనా ఎలాంటి ప్రమాదమైనా జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పొలిమేర దగ్గర ముష్టూరు గ్రామానికి చెందిన దివంగత బోయ కాటమయ్య 100 సంవత్సరాల క్రితం 5 ఎకరాల డీ పట్టా భూమి ఇతరులతో కొనుగోలు చేశాడన్నారు. ఆయన కుమారులు, మనవళ్లు ఇప్పుడు దౌర్జన్యంగా దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. ఎవరైనా నిలదీస్తే దాడులు చేస్తున్నారన్నారు. తోటల్లో స్టార్టర్ పెట్టెలు, మోటార్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లను ధ్వంసం చేస్తున్నారన్నారు. వీరి దెబ్బకు భయపడి తోటల వద్ద మహిళలు ఒంటరిగా ఉండలేని పరిస్థితి ఉందన్నారు. ఇటుకలపల్లి, వజ్రకరూరు, బత్తలపల్లి, కూడేరు, ఉరవకొండ, అనంతపురం వన్‌టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో వీరిపై కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవల గ్రామంలో ఓ యువతికి పెళ్లి నిశ్చయమైతే పెళ్లి చేసుకునే యువకుడికి ఫోన్ చేసి ఆ అమ్మాయి పట్ల అసభ్యంగా చెప్పడంతో ఆ పెళ్లి కాస్తా పెటాకులైందన్నారు. ఈ ఘటనపై గ్రామ ప్రజలందరూ ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారంతా ఇంటి మీదకు వచ్చి గొడవ చేయాలని చూశారన్నారు. గతంలో పోలీసులు కందుకూరు గ్రామంలో ఇలానే నిర్లక్ష్యం చేయడంతో ఒక హత్య జరిగిందని, మన్నీల గ్రామ విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తే అంతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నగిరి ఆదిశేషు, అల్లు షెక్షావలి నాయుడు, అల్లు రామాంజనేయులు, వర్గ ప్రసాద్, రామాంజనేయులు, అన్నగిరి శంకరయ్య, నాగమణి, లక్ష్మీదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశగా తరలివచ్చి.. అర్జీలు అందించి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీలు పోటెత్తాయి. ప్రజల నుంచి కలెక్టర్ ఓ.ఆనంద్‌తో పాటు డీఆర్ఓ ఎ.మలోల, జెడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 422 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి అర్జీదారులతో మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు నాణ్యమైన పరిష్కారం చూపాలని చెప్పారు.

వినతుల్లో కొన్ని...

- తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించాలని అనంతపురం పాతూరులో నివాసముంటున్న చాంద్ బాషా విన్నవించాడు. గతంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కంటింజెట్ ఉద్యోగిగా పని చేసే వాడినని, ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఉద్యోగం చేయలేక పోయానని చెప్పాడు. ప్రస్తుతం ఆరోగ్య బాగుందని, తిరిగి తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరాడు.
- మిషన్ వాత్సల్య పథకం కింద తన పిల్లలకు ఆర్థిక సహాయం అందించాలని స్థానిక జనచైతన్య నగర్‌కు చెందిన నీలావతి విన్నవించింది. తన భర్త చనిపోయాడని, కుటుంబ పోషణ భారంగా ఉందని వాపోయింది. తనకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని, మిషన్ వాత్సల్య పథకం కింద ప్రతి నెలా ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.
- తమ భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేశారని కళ్యాణదుర్గం మండలం మోరేపల్లి గ్రామానికి చెందిన రాము ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 523లో తమకున్న రెండు ఎకరాలు భైరవానితిప్ప కాలువకు పోయిందని చెప్పాడు. ఆన్‌లైన్‌లో తమ భూమికి సంబంధించి 68 సెంట్లు రమేష్ అనే వ్యక్తి పేరున నమోదైందన్నాడు. ఇందుకు సంబంధించి ఫైలు కలెక్టరేట్‌కు వచ్చినా పరిష్కారం కాలేదని వాపోయాడు. న్యాయం చేయాలని కోరాడు.
- పెద్దమనిషిగా ప్రజల తరఫున మాట్లాడిన తనపై దౌర్జన్యం చేయడమే కాకుండా కూడేరు పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టారని కూడేరు మండలం మరుట్ల గ్రామానికి చెందిన గొల్ల చిదంబరప్ప వాపోయాడు. తమ గ్రామంలోని పోస్టాఫీసు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామంలో కొందరు జేసీబీతో కూల్చి ఆక్రమించుకున్నారని చెప్పాడు. ప్రజలకు అక్కడ పోస్టాఫీసు కావాలని చెప్పినా వినకుండా తనపై దౌర్జన్యం చేస్తున్నారని తెలిపాడు. పోలీసులు కూడా పట్టించుకోవడం లేదని, దీనిపై న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించాడు.

తాడిపత్రిలో 'కాక' రేపిన జేసీ



జేసీ ప్రభాకర్‌రెడ్డి



కాకర్ల రంగనాథ్

తాడిపత్రి టౌన్: జేసీ కుటుంబం తమ ఆధిపత్యం కోసం ప్రత్యర్థి పార్టీల నాయకులనే కాకుండా సొంత పార్టీ నాయకులపై సైతం కక్షపూరితంగా వ్యవహరిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తాజాగా సోమవారం తాడిపత్రిలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీకే చెందిన కాకర్ల బ్రదర్స్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రకటించి సొంత పార్టీ నాయకులే విస్తుపోయేలా చేశారు. సీఎం సామాజికవర్గానికి చెందిన కాకర్ల రంగనాథ్, జయుడు, రంగనాయకులు గ్రూపు, కుల రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, అందుకే వారిని సస్పెండ్ చేస్తున్నట్లు తీర్మానించడం గమనార్హం. గత కొన్ని రోజులుగా తాడిపత్రిలో జేసీ, కాకర్ల బ్రదర్స్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. వినాయక చవితి వేడుకల్లో ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకొని రణరంగం సృష్టించారు. సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా ఇరువర్గాలు ఒకరిని మించి మరొకరు బలప్రదర్శనకు సిద్ధమయ్యారు. కాకర్ల బ్రదర్స్ స్టిక్కర్ కనిపిస్తే వాహనాలను ధ్వంసం చేస్తామని అప్పట్లో టీడీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా పేర్కొనడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ క్రమంలోనే కాకర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని టీడీపీ జిల్లా, రాష్ట్ర నాయకుల ముందు జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రతిపాదన ఉంచినట్లు సమాచారం. అయితే వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో జేసీ తనకు తానుగా కాకర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించి మరోసారి చర్చకు తెరతీశారు. కాగా, కాకర్ల రంగనాథ్ సీఎం చంద్రబాబు సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు మంత్రి నారా లోకేష్‌తో సన్నిహిత సంబంధాలు కల్గి ఉన్న నేపథ్యంలో తాడిపత్రి టీడీపీలో ముమ్ముందు ఏం జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక



ఎంపికైన ఖోఖో బాలికల జట్టు

అనంతపురం కార్పొరేషన్: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్, ఖోఖో పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే బాలబాలికల జట్ల ఎంపిక సోమవారం అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేపట్టారు. ఉభయ జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని హాజరై ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఖోఖో బాలికల జట్టుకు స్వప్న, సోనిక, ధానేశ్వరి, అంజలి, లలిత, హారిణి, భవ్యశ్రీ, శ్వేత, పావని, సంధ్య, జయషాలిని, మౌనిక ఎంపికయ్యారు. బాలుర జట్టులో నందకిషోర్, కార్తీక్, అనిల్‌కుమార్, హరికృష్ణ, దేవేంద్ర, నరేంద్ర, చరణ్, సందీప్, పూరణ్‌చంద్ర, గణేష్‌కుమార్, జైకృష్ణ, హర్ష చోటు దక్కించుకున్నారు. అలాగే హ్యాండ్‌బాల్ బాలుర జట్టుకు అభిషేక్, అర్జున్, పవన్‌కుమార్, తరుణ్, పునీత్‌కుమార్, దేవేంద్ర, హిమేష్, శివశంకర్, అభిరాం, సూర్యతేజ, ఉదయ్‌సాయి, జగన్‌మోహన్, లిఖిత్, లోవరాజు, వర్ధన్, జాఫర్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో అర్చన, రక్షిత, సుస్మిత, నాగరత్న, గంగమ్మ, హాసిని, లక్ష్మి, గురువర్షిణి, హరిణి, జనప్రియ, నందిని, ఉమ, అక్షయ, రిత్, బృందా, హర్షిత చోటు దక్కించుకున్నారు.

ప్రేమికులు తెచ్చిన తంటా

- పోలీసులపై చర్యలకు రంగం సిద్ధం

అనంతపురం సెంట్రల్: ప్రేమికులకు ఇచ్చిన కౌన్సెలింగ్ పోలీసు సిబ్బంది మెడకు చుట్టుకుంది. పలువురిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. అయితే ఈ విషయంపై మాట్లాడేందుకు పోలీసు అధికారులు నిరాకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు... గార్లదిన్నె మండలంలో ఓ గ్రామానికి చెందిన 22 సంవత్సరాల యువతి, 16 సంవత్సరాల బాలుడు ప్రేమించుకుని ఇంటి నుంచి పారిపోయారు. అనంతపురం నాల్గో పట్టణ పీఎస్ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన వారి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో రెండు రోజుల క్రితం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో మోకాళ్లపై నిలబెట్టి తీవ్రస్థాయిలో మందలించారు. ఈ విషయం కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు.. ఆ రోజు ఏం జరిగిందనే అంశంపై సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నిర్ధారించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఇందులో ఓ మహిళా కానిస్టేబుల్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై నాల్గవ పట్టణ సీఐ జగదీష్‌ను వివరణ కోరగా... ప్రేమ జంటను మోకాళ్లపై నిలబెట్టలేదని, మంచిగా జీవించాలని కౌన్సెలింగ్ చేసినట్లు వివరించారు.

అరాచక రాజు.. పోలీసుగా అనర్హుడు

కూడేరు పోలీస్ స్టేషన్ సీఐ రాజు అరాచకాలపై బాధితులు కదం తొక్కారు. సోమవారం అనంత వేదికగా పోటెత్తారు. ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి సీఐ రాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఓ పోలీస్ అధికారిపై ప్రజాగ్రహం పెల్లుబుకింది.

- సీఐ రాజు అరాచకాలపై పోటెత్తిన బాధితులు
- నగరంలో భారీ ర్యాలీ
- ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా
- తక్షణమే సస్పెండ్ చేయాలి: విశ్వ



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం సెంట్రల్: ఉరవకొండ నియోజకవర్గం కూడేరులో సీఐ రాజు అరాచకశక్తిగా మారాడని, ఆయన పోలీసు ఉద్యోగానికి అనర్హుడని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, పీఏసీ సభ్యుడు వై.విశ్వేశ్వరరెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఐ రాజు ఆగడాలను నిరసిస్తూ సోమవారం అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకూ బాధితులు భారీ ర్యాలీగా చేరుకుని ధర్నా చేపట్టారు. అనంతరం బాధితులతో కలిసి డీఎస్పీ శ్రీనివాసరావుకు విశ్వ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో విశ్వ మాట్లాడారు.

టీడీపీ కార్యాలయంగా కూడేరు పీఎస్..

కూడేరు పీఎస్ సీఐగా రాజు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పోలీస్ స్టేషన్‌ను టీడీపీ కార్యాలయంగా మార్చేశారని విశ్వ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా దుర్భాషలతో రెచ్చిపోతూ భౌతిక దాడులకు తెగబడుతున్నారన్నారు. పోలీసు స్టేషన్‌కు ప్రజాప్రతినిధులు వెళితే కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదన్నారు. దళితుల పట్ల చిన్నచూపు చూస్తూ అవమానిస్తున్నారన్నారు. కడదరకుంటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామచంద్రను అకారణంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇరికించి పైశాచిక ఆనందాన్ని పొందారన్నారు. బ్రాహ్మణపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగిరెడ్డి అల్లుడిని పొలంలోకి కాలు పెట్టకుండా అడ్డుకున్నారన్నారు. అక్రమ కేసులు బనాయించి రిమాండ్ పేరుతో జైలు పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్దలాపురం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను బలవంతగా టీడీపీలోకి చేర్పించి.. పోలీసుస్టేషన్‌లోనే కండువాలు వేసి కేక్ కట్ చేయించిన సీఐ రాజు పోలీసు ఉద్యోగానికి పనికిరాడని, తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

> **సీఐ కనుసన్నల్లోనే అక్రమ దందా..**
>
> సీఐ రాజు కనుసన్నల్లోనే కూడేరు పీఎస్ పరిధిలో అక్రమ దందా జోరుగా సాగుతోందని విశ్వ విమర్శించారు. ఇప్పటి వరకూ రూ. 10కోట్లు విలువ జేసే గ్రానైట్‌ను రోజూ పోలీసుస్టేషన్ ముందు నుంచే అక్రమంగా తరలించారన్నారు. ప్రతి గ్రామంలోనూ నాలుగైదు బెల్టుషాపులు, జూదగృహాలు నడుపుతున్నారన్నారు. ఇందులో మంత్రి పయ్యావుల కేశవ్ వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిపై దృష్టి సారించని కేశవ్.. నియోజకవర్గాన్ని పేకాట స్థావరంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారని విమర్శించారు. తన అక్రమ దందాలు సక్రమంగా నిర్వహించే ఏజెంట్‌గా ఏరికోరి సీఐ రాజును తెప్పించుకున్నారని ఆరోపించారు. సీఐ తీరు మారకపోతే కూడేరు పీఎస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు..

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై. ప్రణయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కూడేరు సీఐ రాజుకు వ్యతిరేకంగా ఇంత మంది ధర్నా చేస్తున్నారంటే ఆయన దౌర్జన్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఎనిమిది పదుల వయస్సున్న సర్పంచ్ పోలీస్ స్టేషన్‌కు వెళితే కనీసం ఆయన వయస్సుకు కూడా గౌరవం ఇవ్వకుండా బండబూతులతో రెచ్చిపోయారన్నారు. టీడీపీకి కొమ్ము కాస్తూ పీఏబీఆర్ వద్ద అక్రమ మైనింగ్ సాగిస్తూ రూ. 10కోట్లకు పైగా సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో చోళసముద్రంలో జూద గృహాలను దగ్గరుండి నడిపిస్తున్న సీఐ రాజును ఎలాంటి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవా, విడపనకల్లు ఎంపీపీ పుష్పావతి, వజ్రకరూరు ఎంపీపీ దేవీబాయి, బెళుగుప్ప జెడ్పీటీసీ త్రిలోక్‌కుమార్‌రెడ్డి, ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, సర్పంచు బసవరాజు, నాయకులు గోవిందు, నీలకంఠారెడ్డి, ఏకిల శ్రీనివాసులు, దేవేంద్ర, నరసింహులు, రంగారెడ్డి, వడ్డే గంగాధర, సంగప్ప, రామ్మోహన్, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, రామచంద్ర, రమేష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తూ పరిస్థితి వివరిస్తున్న దృశ్యం

పూజారి ముసుగులో గంజాయి విక్రయం

- ఇద్దరి అరెస్ట్.. 4 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గుంతకల్లు: ఆలయ పూజారి ముసుగులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరొకరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎక్సైజ్ సీఐ శివసాగర్ వెల్లడించారు. సోమవారం గుంతకల్లులోని హనుమన్ సర్కిల్‌లో తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే అడ్డుకుని పరిశీలించారు. వారి వద్ద 4 కిలోల ఎండు గంజాయి గుర్తించి అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఏలూరు జిల్లా వెంకటాపురంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న పూజారి సురేష్‌బాబు కుమారుడు తిరునగరి మోహన్‌సుందర్ జల్సాలకు అలవాటు పడి పలు దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామ రామాలయంలో అర్చకుడిగా చేరాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి అబ్బేదొడ్డికి చెందిన సాయిరామ్ అలియాస్ గంజాయి సాయి ద్వారా గుత్తి, గుంతకల్లు పట్టణాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టాడు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల క్రాస్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలకు చెందిన శివప్రసాద్ (35) వ్యక్తిగత పనిపై సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. బీకేఎస్ శివారున నార్పల క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న ఆటో బోల్తాపడింది. ఆ సమయంలో వెనుకనే ఉన్న శివప్రసాద్ వేగాన్ని నియంత్రించుకోలేక బోల్తాపడిన ఆటోను ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక మృతిచెందాడు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఎక్కబోతూ...



మృతురాలు నారాయణమ్మ

పెద్దపప్పూరు: ట్రాక్టర్ ఎక్కబోతూ కాలు జారి కింద పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని నామనాంకపల్లికి చెందిన నారాయణమ్మ (70)కు ముగ్గురు సంతానం కాగా, చిన్న కుమారుడి వద్ద ఉంటూ వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తోంది. సోమవారం కూలి పని కోసం వెళ్లిన ఆమె సాయంత్రం వర్షం కురుస్తుండడంతో కూలీలందరితో కలసి ఇంటికి వెళ్లేందుకు ట్రాక్టర్ వద్దకు చేరుకుంది. ట్రాక్టర్ ఎక్కబోతుండగా కాలికి అయిన బురద కారణంగా జారి కిందపడింది. ఆ సమయంలో ఆయుపట్టుకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని...



మృ IS|IS కుళ్లాయప్ప

తాడిపత్రి రూరల్: టిప్పర్ ఢీకొని ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరుకు చెందిన కుళ్లాయప్ప (38) ఉపాధి కోసం కుటుంబసభ్యులతో కలిసి తాడిపత్రికి వలస వచ్చి షేర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆటోలో వెళుతుండగా చుక్కలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ టిప్పర్‌తో సహా ఉడాయించాడు. అదే సమయంలో మరో ఆటోలో వెళుతున్న సోదరి కృష్ణవేణి గుర్తించి వెంటనే కుళ్లాయప్పను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు.

గుట్టను కరిగిస్తున్న 'తమ్ముళ్లు'

- ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుంటూ నిరాటంకంగా మట్టిదోపిడీ



మట్టిని తవ్వి టిప్పర్‌లోకి లోడ్ చేస్తున్న హిటాచీ వాహనం

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి గుట్టను టీడీపీ నాయకులు కరిగిస్తున్నారు. ఈ గుట్ట రాప్తాడు సమీపంలో 44వ జాతీయ రహదారికి దగ్గర్లోనే ఉంది. మొన్నటి వరకు గుట్టకు తూర్పు వైపున అక్రమంగా మట్టిని తవ్వేసిన 'తమ్ముళ్లు'.. ఇప్పుడు కొండ చుట్టూ రాత్రి, పగలు తేడా లేకుండా కొల్లగొడుతున్నారు. గుట్ట తవ్వకునేందుకు లీజుదారులు అభ్యంతరం తెలిపినా వారు వినడం లేదు. గొందిరెడ్డిపల్లి, ఎం.బండమీదపల్లి, రాప్తాడుకు చెందిన నలుగురు 'తెలుగు తమ్ముళ్లు' కలసికట్టుగా దోపిడీకి తెరలేపారు. వీరికి సొంతంగా టిప్పర్లు, జేసీబీలు, హిటాచీ వాహనం ఉన్నాయి. వీటి సాయంతో నిత్యం మట్టి తవ్వకాలు చేపడుతూ నగరానికి తరలిస్తున్నారు. రోజూ 100 నుంచి 150 ట్రిప్పుల మట్టి రవాణా చేస్తున్నారు. ఖర్చులన్నీ పోను రోజూ రూ.2 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్న ఈ నాయకులు కూటమి ప్రభుత్వం వచ్చాక గొందిరెడ్డిపల్లి కొండ పుణ్యమా అని రూ.కోట్లకు పడగలెత్తారు. వీరి అక్రమ దందాకు కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వారికి నెలవారీ మామూళ్లు ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ కారణంగానే పోలీసులు, ఆర్టీఏ, భూగర్భ గనుల శాఖ విజిలెన్స్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు పొరపాటున ఎవరైనా వీరి వాహనాలను ఆపితే వెంటనే కొందరితో ఫోన్లు చేయిస్తున్నారు. తరచూ రాప్తాడు నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి పేరు చెబుతూ మట్టి దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి శైలజనాథ్



సమస్యను ఏఎస్ఐకు వివరిస్తున్న శైలజనాథ్

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజక వర్గంలో బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజనాథ్ భరోసానిచ్చారు. బీకేఎస్ మండలం చెదుల్ల గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త వన్నూరప్పను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఎలాంటి తప్పు చేయకపోయినా పోలీసులు అక్రమ కేసులు బనాయించి స్టేషన్‌కు రావాలని బెదిరిస్తున్నారని వన్నూరప్ప భార్య వాపోయింది. స్పందించిన శైలజనాథ్ వెంటనే పీఎస్‌కు చేరుకుని పోలీసులతో మాట్లాడారు. ప్రజల పక్షాన నిలిచి బాధితులకు న్యాయం చేయాలని, దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు చట్ట బద్ధంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంతరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పార్వతి, మాజీ జెడ్పీటీసీ గువ్వల శ్రీకాంతరెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, కాటమయ్య, నరేష్, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో వ్యక్తి గల్లంతు



నాగభూషణం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన నాగభూషణం, ఓబులేసు సోమవారం బెళుగుప్ప మండలం జీడిపల్లిలో ఉన్న బంధువు కర్మకాండలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. హంద్రీ నీవా కాలువ వద్దకు చేరుకోగానే స్నానం చేసేందుకు సిద్ధమయ్యారు. ఓబులేసుకు ఈత రాకపోవడంతో మెట్ల వెంట దిగి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుని వచ్చాడు. అనంతరం నాగభూషణం కాలువలో దిగి ఈత కొడుతూ ప్రవాహ వేగానికి కొట్టుకు పోయాడు. ఆ సమయంలో ఓబులేసు కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసే లోపు నాగభూషణం (62)కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

హుండీ అపహరణ

గార్లదిన్నె: మండలంలోని కృష్ణాపురంలో వెలసిన వైకుంఠనాథుని ఆలయంలో చోరీ జరిగింది. గ్రామ శివారున ఇటీవల నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని దుండగులు అపహరించారు. సోమవారం ఉదయం మైక్ ఆన్ చేసేందుకు వెళ్లిన వ్యక్తి ఆలయం తలుపులు తెరచి ఉండడం గమనించి, లోపలికి వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు. గ్రామస్తుల ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో పోలీసులు పరిశీలించారు. వ్యవసాయ పొలాల్లో దుండగులు పడేసిన హుండీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ.20 వేల వరకూ నగదు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

గుంతకల్లు: స్థానిక బీఎస్ఎస్ కాలనీలోని మార్కేండేయ స్వామి ఆలయం వద్ద ఓ చిన్నారిపై వీధి కుక్కల మంద దాడి చేసింది. బీఎస్ఎస్ కాలనీకి చెందిన రామలక్ష్మి తన మూడేళ్ల వయసున్న కుమార్తె సుచిత్రను సోమవారం సాయంత్రం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వదిలేందుకు వెళుతుండగా ఒక్కసారిగా ఆరు కుక్కలు వీరిపై దాడి చేశాయి. సుచిత్రను రెండు కుక్కలు కరవడంతో నడుంపై రక్తగాయాలయ్యాయి. చిన్నారిని రామలక్ష్మి తన గుండెలకు హత్తుకున్నా కుక్కలు వీడలేదు. ఆ సమయంలో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని కుక్కలను తరిమేశారు. సుచిత్రను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

గుత్తిలో పందుల దొంగల బీభత్సం

- రాళ్లు, మద్యం బాటిళ్లతో దాడి



గాయపడిన పందుల యజమాని నారాయణస్వామి

గుత్తి: స్థానిక తురకపల్లి రోడ్డులో పందుల దొంగలు బీభత్సం సృష్టించారు. ఆదివారం అర్ధరాత్రి, తిరిగి సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో పందుల పెంపకందారులపై రాళ్లు, మద్యం బాటిళ్లతో విరుచుకుపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో బొలెరో వాహనంలో వచ్చిన పది మంది దుండగులు పందులను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో అక్కడికి సమీపంలో ఉన్న చేపల వెంకటేష్ గమనించడంతో అతనిపై రాళ్లు, మద్యం బాటిళ్లతో విరుచుకుపడ్డారు. దాడిలో వెంకటేష్‌కు చెందిన రెండు ఐచర్ వాహనాలు దెబ్బతిన్నాయి. దూసుకొస్తున్న రాళ్లు, మద్యం బాటిళ్ల నుంచి తప్పించుకునే క్రమంలో ఐచర్ వాహనాల డ్రైవర్లు, చేపల సిబ్బంది అక్కడి పరుగు తీసి ఓ గదిలో దూరి షట్టర్ వేసుకున్నారు. విషయం తెలుసుకున్న పందుల పెంపకందారులు నారాయణస్వామి, వెంకటరాముడు, శీను, గంగన్న తదితరులు తురకపల్లి రోడ్డులోకి చేరుకోగా మరోసారి వారిపై కూడా రాళ్లు, బాటిళ్లతో దాడికి తెగబడ్డారు. నారాయణస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే పందుల పెంపకందారులు కూడా దీటుగా ఎదుర్కోవడంతో కొన్ని పందులను వదిలి బొలెరో వాహనంలో ఉడాయించారు. ఈ దృశ్యాలన్నీ అక్కడున్న సీసీ కెమెరా పుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)లో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు అనంతపురంలోని ప్రభుత్వ ఐటీఐ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రాయపరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, 16న ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలి. 17న కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు కల్పిస్తారు.

విద్యార్థులకు సైన్స్ సెమినార్ పోటీలు

అనంతపురం సిటీ: జాతీయ సైన్స్ సెమినార్-2025ను పురస్కరించుకుని 'క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ - పొటెన్షియల్, ఛాలెంజస్' అంశంపై జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో చదివే 8 ,9 10 విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సైన్స్ సెంటర్ జిల్లా అధికారి బాలమురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15న పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన ఇద్దరికి 16న మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. మండల స్థాయిలో ఎంపికైన ఇద్దరి చొప్పున ఈ నెల 17న అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు సైన్స్ సెమినార్ నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఐదు చార్ట్స్, స్లైడ్స్ ఉపయోగిస్తూ గరిష్టంగా ఆరు నిమిషాల పాటు ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి సెమినార్‌లో ప్రతిభ చాటిన ఇద్దరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

క్లుప్తంగా

ఆర్‌డీటీ పరిరక్షణకు ప్రాణ త్యాగానికైనా సిద్ధం


కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టిన బీబీఎస్ నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో పేదలకు వర ప్రసాదంగా ఉన్న ఆర్‌డీటీ సంస్థను కాపాడుకునేందుకు ప్రాణత్యాగానికైనా తాము సిద్ధమని భారతీయ భీమ్ సేన (బీబీఎస్) వ్యవస్థాపకుడు జై భీమ్ రామాంజినేయులు స్పష్టం చేశారు. సేవ్ ఆర్‌డీటీ– సేవ అనంత నినాదంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్షను నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో రామాంజినేయులు, దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ సంస్థను జిల్లా నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ నిలిపివేశాన్నారు. రామాంజినేయులుతో పాటు బీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుళ్లాయప్ప, జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, గుంతకల్లు నియోజకవర్గం అధ్యక్షుడు సురేష్ నిరాహార దీక్ష చేపట్టారు.

మార్మోగుతున్న వేదపారాయణం

అనంతపురం కల్చరల్: నగరంలోని లెక్చరర్స్ కాలనీ శ్రీవేదమాత భవనం వేదికగా రెండు రోజులుగా వేదపఠనం మార్మోగుతోంది. సోమవారం వేదభవనంలో జరిగిన సమావేశంలో నిర్వాహకులు మరో వారం రోజుల పాటు సాగే వివరాలనందించారు. విఖ్యాత యజుర్వేద పండితుడు కై ప హరికృష్ణశర్మ నేతృత్వంలో జరుగుతున్న సంపూర్ణ శ్రీకృష్ణ యజుర్వేద హవనం, శ్రీకృష్ణ యజుర్వేద జటా పారాయణంలో భాగంగా ఈనెల 15న శ్రీకృష్ణ యజుర్వేద హవన మహాపూర్ణాహుతి, 19న శ్రీకృష్ణ యజుర్వేద జటా పారాయణ విద్వత్సభ జరుగుతాయని తెలిపారు.

కార్మికులను తొలగిస్తే పోరాటం ఉధృతం

అనంతపురం అర్బన్: వైద్య కళాశాల, ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికులను తొలగిస్తే పోరాటం ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ హెచ్చరించారు. కొత్త కాంట్రాక్టర్లు బాధ్యతలు తీసుకున్న వెంటనే కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, జీఓ 138 ప్రకారం వేతనం రూ.18,600 ఇవ్వాలన్నారు. సమస్య సాధనకు మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నాయకుల వెంకటేష్, శోభ, వన్నూరు, అంజరి, ఫామిదా, లక్ష్మిదేవి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా బ్రోచర్ ఆవిష్కరణ

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమైక్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న గుంటూరులో బ్రాహ్మణ యువతీ యువకులకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం పశ్చిమ రాయలసీమ కోఆర్డినేటర్ పీవీ ప్రసాద్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కేకే ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మఠం సోమశేఖర్‌శాస్త్రి, జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌కే రాఘవేంద్రరావు ఉన్నారు.

అలరించిన నాట్యకళారూపం

అనంతపురం కల్చరల్: 'అయిగిరి నందిని నందిత మోహిని' అంటూ చిన్నారులు చేసిన మోహినీ భస్మాసుర నాట్యకళారూపం ఆహూతులను ఆకట్టుకుంది. సీనియర్ నాట్యాచార్యులు కృష్ణమూర్తి రాజు వద్ద శిష్యరికం చేసి శాస్త్రీయ నాట్యగురువుగా మారిన శ్రీదేవి అరవిందనగర్‌లో రెండురోజుల పాటు నృత్యవేడుకలు నిర్వహించారు. శ్రీదేవి నృత్యక్షేత్రం ఆరంభ సమావేశంలో శ్రీదేవి శిష్యబృందం భస్మాసుర కూచిపూడి రూపకంతో పాటూ మోహిని రూపిణి ప్రదర్శించి మెప్పించారు. అలాగే వాగ్గేయకారుల కృతులపై చేసిన ప్రదర్శనలను ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన డీఆర్వో మలోల, కృష్ణమూర్తి రాజు, ప్రసాద్ తదితరులు తిలకించి ప్రశంసించారు. శ్రీదేవి మాట్లాడుతూ రోజూ కూచిపూడి, భరత నాట్యం వంటి శాస్త్రీయ నృత్యాలలో శిక్షణ ఇస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మద్యం నాణ్యతపై తనిఖీలు

అనంతపురం సెంట్రల్: నగరంలో పలు మద్యం షాపులు, బార్లలో విక్రయిస్తున్న మద్యం నాణ్యతను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి. రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. అనంతపురం సీఐ సత్యనారాయణతో కలిసి పలుచోట్ల శాంపిల్స్‌ను సేకరించారు. నకిలీ మద్యంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. నకిలీ మద్యం పట్టుబడితే సంబంధిత మద్యం షాపులు, బార్లు షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇది నారా వారి పాలనా? నకిలీ సారా వారి పాలనా?

- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం
- ఎక్సైజ్ డీసీ కార్యాలయం వద్ద ధర్నా


కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనంతపురం:రాష్ట్రంలో నారా వారి పాలన సాగుతోందా.. లేదంటే నకిలీ సారా వారి పాలన సాగుతోందా? అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం మద్యం విధానాలకు వ్యతిరేకంగా అనంతపురం నగరంలో సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద మూడు గంటల పాటు ధర్నా చేశారు. డిప్యూటీ కమిషనర్ అందుబాటులో లేరని అధికారులు చెప్పడంపై శ్రేణులు మండిపడ్డారు. డీసీ లేకపోతే ఇక కార్యాలయం ఎందుకని ప్రశ్నించారు. నకిలీ మద్యానికి కొమ్ముకాస్తున్న డిప్యూటీ కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మూడు గంటల పాటు వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసనతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. 'ఎన్' బ్రాండ్ కల్తీ మద్యం నిలిపివేయండి, 'నాణ్యమైన మద్యం అంటే కల్తీ మద్యమా', 'బెల్టుషాపులను లేకుండా చేయాలి', 'కల్తీ రాజ్యం.. నకిలీ రాజ్యం' అంటూ నినాదాలు చేశారు. డిప్యూటీ కమిషనర్ వచ్చి వినతిపత్రం తీసుకోకపోతే ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు. మూడు గంటల పాటు అక్కడే బైఠాయించారు. చివరకు కార్యాలయానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. సీఐ శ్రీకాంత్ చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, కాసేపు వాగ్వాదం జరిగింది. పోలీసుల తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఎట్టకేలకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య రావడంతో ఆందోళన విరమించి వినతిపత్రం అందించారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాల్సిందే..

ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్,ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యం అరికట్టాలని, విస్తృత తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురంలో ఉన్న వైన్ షాపులు, పర్మిట్ గదులు, బార్లలో తనిఖీలు చేయాలన్నారు. బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. నకిలీ, కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైన్‌షాపుల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని, అనర్హులను తొలగించాలని కోరారు.

నాడు పారదర్శక మద్యం విధానం..

వైఎస్ జగన్ హయాంలో పారదర్శకంగా మద్యం విక్రయాలు జరిగాయని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించడంతో ఆదాయం కూడా వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్‌కు అప్పగించడంతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని విమర్శించారు. మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ చూపాలని, మద్యం విక్రయ వేళలు తగ్గించాలని డిమాండ్ చేశారు. బడి, గుడి, పబ్లిక్ ప్లేసుల్లో ఏర్పాటు చేసిన వైన్ షాపులు, బార్ల లైసెన్సులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, అమరనాథ రెడ్డి, మల్లెమీద నరసింహులు, సైపుల్లాభేగ్, శంకరయ్య, ఓబిరెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కాగజ్‌ఘర్ రిజ్వాన్, జానీ, వెన్నం శివారెడ్డి, రాధాకృష్ణ, కట్టుబడి తానీషా, దాసిరెడ్డి, కృష్ణవేణి, మారుతినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వర్థనాయక్, నగర విభాగం అనుబంధ సంఘాల అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, లక్ష్మన్న, శ్రీనివాస దత్తా, కైలాష్, పసలూరి ఓబుళేసు, మహిళా విభాగం నాయకురాళ్లు ప్రియాంక, జాహ్నవి, భారతి, శోభ, ఖమర్తాజ్, హజరాబి, దేవి, సుజాత, అంజలి, కార్పొరేటర్లు జయలలిత, లావణ్య, సంపంగి రామాంజినేయులు, కమల్ భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, శేఖర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గౌస్‌బేగ్, సుబ్బయ్య, దాదాపీర్, నాగార్జున రెడ్డి, చింతకుంట మధు, జావీద్, ఖాజా, కుళ్లాయిస్వామి, రమణా రెడ్డి, సాదిక్, మల్లెల వేణుగోపాల్, పురుషోత్తం రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ఆసిఫ్, మైను, అనిల్‌కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రతినిధులు

'సేవ్ పాపంపేట'

- పాపంపేట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం
- బాధితులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పాపంపేట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'సేవ్ పాపంపేట' ర్యాలీ


కలెక్టర్ ఆనంద్‌కు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట పొలంలోని శోత్రియం భూముల్లో 60 ఏళ్లుగా చట్టబద్ధంగా ఉంటున్న వారిని ఇటీవల కొందరు కబ్జాదారులు అక్రమ రిజిస్ట్రేషన్లను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగుతున్నారు. బాధితులందరూ కలిసి పాపంపేట పరిరక్షణ సమితి పేరుతో ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం 'సేవ్ పాపంపేట' పేరుతో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. వీరికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కలెక్టర్‌తో మాట్లాడారు. నెల్లూరు సెటిల్ మెంట్ పట్టాలు పొంది, ఆ తర్వాత రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ క్రమంలో కొనుగోలుదారులు బ్యాంకుల్లో తనాఖా పెట్టి ఇళ్లకూడా కట్టుకున్నారన్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. అలాంటి భూములను ఎలా తప్పుడు రిజిస్టర్ చేస్తారని ప్రశ్నించారు. వారంలోపు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాల్సిందేనని, లేదంటే బాధితులతో కలిసి రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పరిటాల సునీత అండతోనే కబ్జాలు

ఎమ్మెల్యే పరిటాల సునీత అండతోనే కబ్జాదారులు పాపంపేట భూములపై పడ్డారన్నారు. శోత్రియం భూముల యజమానులతో సునీత బంధువులు జీపీఏ చేయించుకున్నారన్నారు. ఖాళీ స్థలాలు ఎక్కడుంటే అక్కడ వాలిపోతున్నారని వాపోయారు. ఇప్పటికే 300 ఎకరాల దాకా జీపీఏ చేసుకున్నారని ఆరోపించారు.గ్రామాలు గ్రామాలు, కాలనీలు, కాలనీలు ఖాళీ చేయించేలా ఈ ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. సుమారు 10 వేల కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నాయన్నారు. చట్టపరంగా పోరాడి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, పాపంపేట పరిరక్షణ సమితి నాయకులు భోగే గోపాల్‌రెడ్డి, మఠం శ్యాంసుదర్, మాదన్న, అక్కంపేట గోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, అక్కంపేట ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరయ్య, కుమ్మెత గోపాల్‌రెడ్డి, గోపి, మంగలి చిరంజీవి, గుగ్గిళ్ల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, వెంకటేశ్వరప్రసాద్, నరసింహులు, మాజీ డీలర్ రమేష్, భాస్కర్‌రెడ్డి, పాటిల్ లోకనాథరెడ్డి, కురుబ మల్లేష్ నిజాముద్దీన్, ఇబ్రహీం, ముస్తఫా ఉన్నారు.

హరితాంధ్రప్రదేశ్ లక్ష్యం


మాట్లాడుతున్న ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ గురుప్రభాకర్

అనంతపురం కార్పొరేషన్: హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జిల్లాలో మొక్కలను విరివిగా నాటాలని ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ గురుప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 11,359 చదరపు కిలోమీటర్లు అని, అందులో అటవీ విస్తీర్ణం 747 చదరపు కిలోమీటర్లు ఉందన్నారు. 2029కి 7 శాతం పచ్చదనం విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అగ్రికల్చరల్, హార్టికల్చర్, నగరపాలక సంస్థ, మునిసిపాలిటీలు, తదితర శాఖలను సమన్వయం చేసుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో 80 వేల హెక్టార్లలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అందు కోసం 5 కోట్ల మొక్కలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ఇటీవల పీలేరు నుంచి పదోన్నతిపై జిల్లాకు వచ్చిన ఆయనకు కింది స్థాయి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యవిద్యను నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబు

రాప్తాడురూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యవిద్యను సీఎం చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం నియోజకవర్గ పరిశీలకులు తాడిపత్రి రమేష్‌రెడ్డితో కలిసి అనంతపురం రూరల్ మండలం చియ్యేడు, పూలకుంట గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు. ఈరోజు చంద్ర బాబు ఆ మెడికల్ కళాశాలలను తన బినామీలకు అప్పగించి అప్పనంగా దోపిడీకి తెర తీశారన్నారు. జగనన్న హయాంలోనే 5 కళాశాలల్లో అడ్మిషన్లు మొదలుపెట్టి తరగతులు కూడా జరుగుతున్నాయన్నారు. తక్కిన 12 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానంలో తన వర్గీయులకు ధారాదత్తం చేస్తున్నారన్నారు.


చియ్యేడులో కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

నకిలీ మద్యం నారా వారిదే

రాష్ట్రంలో నకిలీ మద్యం నారా వారిదేనని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. స్పిరిట్, నీళ్లు, రంగు పొడి కలిపి కావాల్సిన బ్రాండ్లు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఫలితంగా ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.

20 ఏళ్లుగా లేని అభివృద్ధి చేసి చూపించా

ఈ సందర్భంగా పూలకుంట సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గత 20 ఏళ్లుగా చేయలేని అభివృద్ధి తాను చేసి చూపించానన్నారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్‌తో పాటు డ్రైన్లు, సీసీ రోడ్లు, ఊరందరికీ ఉపయోగపడేలా పెద్ద తొట్టి నిర్మించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, నీరుగంటి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, విద్యార్థి విభాగం గణేష్, బీసీ సెల్ దాసరి జయచంద్ర, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, వడ్డే రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, ఉప్పరపల్లి శ్రీనివాసులు, ఈశ్వరయ్య, నరసింహారెడ్డి, గ్రామ కమిటీ చైర్మన్లు నాగేంద్ర, రవీంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగేష్, మంగలి శివయ్య, అక్కులప్ప, రామదాసు, భరత్‌రెడ్డి తదితరులున్నారు.

పత్తాలేని వైద్యురాలు

- ఏఎంసీలో సాయంత్రం విధులకు డుమ్మా


ఏఎంసీలో రోగులకు పీజీనే సేవలందిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని కీలకమైన వార్డుల్లో వైద్యులుండడం లేదు. అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లోని 30 పడకల్లో 80 శాతం ప్రాణాంతక కేసులున్నాయి. ఇటువంటి తరుణంలో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలి. ఎప్పుడు రోగులకు ఏ సమస్య వచ్చినా ప్రాణాలు హరీ అంటాయి. అటువంటిది ఆస్పత్రిలోని ఏఎంసీలో సోమవారం విధుల్లో ఉండాల్సిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పావని ఇంటికెళ్లిపోయారు. దీంతో పీజీలు, స్టాఫ్‌నర్సులపైనే భారం పడింది. పదుల సంఖ్యలో ప్రాణాపాయ స్థితిలో కేసులుంటే వైద్యులు ఉన్న ఫలంగా వెళ్లిపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఇదే విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యంను ఆరా తీస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఫిష్‌మార్ట్‌ను తొలగించొద్దు

అనంతపురం అర్బన్: 'ఫిష్ ఆంధ్ర– ఫిట్ ఆంధ్ర'లో భాగంగా స్థానిక సెరికల్చర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫిష్ మార్ట్ తొలగించకూడదని కలెక్టర్ ఓ.ఆనంద్‌కు బెస్త సేవా సంఘం నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పరిష్కార వేదికలో సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీరమణ, ఉపాధ్యక్షుడు గంగప్ప, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. సెరికల్చర్ ఆఫీసు ముందు స్థలంలో బెస్త శరత్ అనే వ్యక్తి రూ.7 లక్షలు ఖర్చుచేసి ఫిష్ మార్ట్ ఏర్పాటు చేసుకుని ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. స్థలం సెరికల్చర్ శాఖది కానప్పటికీ తొలగించాలంటూ ఆ శాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో నగర పాలక సంస్థ అధికారులు తొలగించేందుకు యత్నించారన్నారు. అయితే, తాము అడ్డుకుని నిలుపుదల చేయించామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేంద్ర, వెంకీ, ఎర్రిస్వామి, నారాయణస్వామి, హరినాథ్, మార్ట్ యజమాని శరత్, తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అనంతపురం అర్బన్: సమాచార హక్కు చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కో–ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టం అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. ఆర్టీఐ యాక్టివిస్టుల పేరుతో అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అంధ, మానసిక వికలాంగుల సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న రవికాంత్ రమణ నిర్వహిస్తున్న మీనాక్షమ్మ ఫౌండేషన్‌కు ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు హన్నూరప్ప, ఫైట్ ఫర్ రైట్స్ అధ్యక్షుడు కే పీరాజు, సమాచార హక్కు చైతన్య వేదిక అధ్యక్షుడు రాయల కొండయ్య, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం

అనంతపురం అర్బన్: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై మతోన్మాద లాయర్ దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, జిల్లా ఇన్‌చార్జ్ చిన్నసుబ్బయ్య మాట్లాడారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో మతోన్మాదం పెరిగిపోతోందన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, బానాసి శీనా, కదిరప్ప, రామాంజినేయులు, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోయవచ్చు

అనంతపురం మెడికల్: ప్రాణాపాయంలో ఉన్న వారికి క్షణాల వ్యవధిలో సీపీఆర్ ద్వారా ప్రాణం పోయవచ్చని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం వైద్య కళాశాలలో కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) అవగాహన వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం మాట్లాడుతూ మెదడుకు రెండు నుంచి మూడు నిమిషాల వరకు ప్రాణవాయువు అందకపోయినా కోలుకోలేని నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బెనెడిక్ట్, ప్రొఫెసర్లు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ హరిబాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమనగోపీచంద్, డాక్టర్ లలిత భవాని, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తిశ్రద్ధలతో వాల్మీకి జయంతి


బోనాలు ఎత్తుకొస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మహర్షి వాల్మీకి జయంతిని సోమవారం తోపుదుర్తి గ్రామంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు, బోనాలు తీసుకువెళ్లి సమర్పించారు. అనంతరం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి జయంతి సందర్భంగా గ్రామంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన తోపుదుర్తి గ్రామానికి చెందిన వృషభాలకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన బళ్లారి వృషభాలకు రూ.20 వేలు నగదును ఎంపీటీసీ బోయ పోతులయ్య చేతుల మీదుగా అందజేశారు.

మోదీ రాకకు వ్యతిరేకంగా నేడు నిరసన

అనంతపురం సిటీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటనను వ్యతిరేకిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ ఎదుట గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి సోమవారం తెలిపారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆక్వారంగం అభివృద్ధికి చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఆక్వా రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఫిషరీస్ కమిషనర్ రామశంకర నాయక్ తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక ఫిషరీస్ డీడీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఏడీ చంద్రశేఖర్ రెడ్డి, ఎఫ్‌డీవోలు ఆసీఫ్, లక్ష్మీనారాయణ, బాబునాయక్ తదితరులతో సమావేశమై మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాకు కేటాయించిన 5.50 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి టార్గెట్‌లో ఇప్పటికే 5.48 కోట్ల ఉత్పత్తి జరిగిందని ఏడీ తెలిపారు.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడండి

అనంతపురం సిటీ: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలని ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు అన్నారు. సోమాజిగూడలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ 241వ బ్యాచ్ ఆఫ్‌లైన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతపురం జిల్లాకు చెందిన 11 మంది విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను సోమవారం అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో ఆదిలక్ష్మి, పుల్లయ్య, ఆనంద భాస్కర్‌రెడ్డి, రామచంద్ర, పవన్‌కుమార్, బాబుద్దీన్, శ్రీనివాసరావు, అరుంధతి, గోవర్ధన్, మహేశ్, హేమలత ఉన్నారు.

నకిలీ మద్యంతో ప్రాణాలకు ప్రమాదం

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే మహేష్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో గుడి, బడి అన్న తేడాలు లేకుండా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు చేయిస్తున్నారన్నారు. నాయకులు సాకే రాజు, రసూల్, సాకే మల్లి ఉన్నారు.